కేజ్రీవాల్ కస్టడి పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానం కేసులో సిబిఐ నమోదు చేసిన కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి ఊరట దక్కలేదు. కస్టడీని సెప్టెంబర్ 3 వరకు రౌస్ ఎవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం నాడు పొడిగించారు. ఇంతకుముందు విధించిన కస్టడీ గడువు నేటితో ముగియడంతో కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచారు. సిబిఐ దాఖలు చేసిన నాలుగో ఛార్జిషీటుపై నిర్ణయాన్ని కూడా రౌస్ ఎవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ ఛార్జిషీటులో కేజ్రీవాల్, మరో ఐదుగురి పేర్లను సిబిఐ చేర్చింది. సెప్టెంబర్ 3న దీనిపై కోర్టు విచారణ జరపనుంది. సిబిఐ, ఇడి దర్యాప్తు చేస్తున్న ఎక్సైజ్ పాలసీ స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. కాగా, ఎక్సైజ్ పాలసీ కేసులో బెయిలు కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సెప్టెంబర్ 5న సుప్రీంకోర్టు ముందుకు రానుంది. అఫిడవిట్ సమర్పించేందుకు మరింత గడువు కావాలని సిబిఐ కోరడంతో అత్యున్నత న్యాయస్థానం గత విచారణలో సెప్టెంబర్5కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. కేజ్రీవాల్ తనకు బెయిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఒక పిటిషన్, సిబిఐ అరెస్టుకు వ్యతిరేకంగా మరో పిటిషన్ వేశారు. అయితే సిబిఐ తమ సమగ్ర అఫిడవిట్‌లో ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ కేజ్రీవాల్ డైరెక్షన్‌లో నాటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో కలిసి తీసుకున్నవేనని సిబిఐ ఆరోపణగా ఉంది. అయితే ఈ ఆరోపణలను ఆప్ తోసిపుచ్చుతూ కేజ్రీవాల్‌ను జైలులోనే ఉంచేందుకు బిజెపి, సిబిఐ కుట్రపన్నుతున్నాయని చెబుతోంది.

జెజెపితో అజాద్ పార్టీ

న్యూఢిల్లీ : రానున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జననాయక్ జనతా పార్టీ (జెజెపి), అజాద్ సామాజ్ పార్టీ (కాన్షిరాం) కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని జెజెపి అధ్యక్షులు, హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా, అజాద్ సామాజ్ పార్టీ (కాన్షిరాం) చీఫ్ చంద్రశేఖర్ అజాద్ ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో సంయుక్తంగా ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా, జెజెపి 70 స్థానాల్లోనూ, అజాద్ సామాజ్ పార్టీ (కాన్షిరాం) 20 స్థానాల్లోనూ పోటీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కూటమిపై దుష్యంత్ చౌతాలా విశ్వాసం ప్రకటించారు. హర్యానాకు ఉత్తమ భవిష్యత్‌ను నిర్మించడానికి రైతులు, కార్మికులు ఏకమయ్యారని తెలిపారు.

బిఎస్‌పి అధినేత్రిగా మాయావతి మళ్లీ ఎన్నిక

లక్నో : బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రిగా మాయావతి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం లక్నో పార్టీ జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి ఆఫీస్ బేరర్లు, దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులతో బిఎస్‌పి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (సిఇసి) నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ విషయాన్ని పార్టీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో పార్టీ ఎలాంటి నిరాశ చెందలేదని తెలిపింది. బిఎస్‌పి వ్యవస్థాపక, అధ్యక్షులు కాన్షిరామ్ తరువాత పార్టీ చీఫ్‌గా మాయావతి కొనసాగుతున్నారు. 2003లో తొలిసారిగా చీఫ్‌గా ఎన్నికయ్యారు. కాగా, మంగళవారం మరోసారి ఎన్నికైన సందర్భంగా మాయావతి 'దళితులు, ఆదివాసీలు, ఒబిసిల్లో జన్మించిన గొప్ప వ్యక్తుల మానవతా మిషన్‌ను బిఎస్‌పి ఉద్యమం ద్వారా ముందుకు తీసుకుని వెళ్లడానికి ఎలాంటి త్యాగానికైనా తాను సిద్ధంగా ఉన్నాని' పార్టీ నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిలు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కవితకు బెయిల్ మంజూరు తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మాజీ మంత్రులు గంగుల, వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కవిత బెయిల్ పై బిజెపి, కాంగ్రెస్ నేతల విమర్శలను ఖండించారు. కవిత బెయిల్ పై సంజయ్ కు అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. సంజయ్, రేవంత్ మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బెంగాల్ నుంచి రాష్ట్రానికి వచ్చిన అక్రమ డబ్బు, రాష్ట్రంలో రేవంత్ కుటుంబ సభ్యులు చేసిన స్కాంపై ఎందుకు సంజయ్ మాట్లాడడం లేదన్నారు. అలాగే.. హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీకి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎందుకు స్పందించడం లేదన్నారు.

సంకుచిత జాతీయవాదం ప్రమాదకరం

- కేరళ సాహిత్య వేత్తల పిలుపు



కన్నూర్‌లో జరిగిన మహాసభలో ప్రసంగిస్తున్న కేరళ సాహిత్య అకాడమీ ఛైర్మన్ కె సచ్చిదానందన్

కన్నూర్ : సంకుచిత జాతీయవాద ధోరణుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వుండాల్సిందిగా ప్రగతిశీల చింతనాపరులకు, సాంస్కృతిక కార్యకర్తలకు కేరళ సాహిత్య వేత్తలు పిలుపునిచ్చారు. కన్నూర్‌లోని ఇ.కె.నయనార్ అకాడమీలో పురోగమన కళా సాహిత్య సంగమ్ 13వ రాష్ట్ర మహాసభ మంగళవారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షులు కె సచ్చిదానందన్ మాట్లాడుతూ దేశభక్తి పేరుతో దళితులు, ముస్లిమ్‌లపై హింస పెరగడాన్ని తీవ్రంగా ఖండించారు. సమైక్య హిందూ మతం అన్న భావనను ఆయన సవాలు చేశారు. భారత ప్రజల గురించి చెప్పేందుకు అరబ్బులు, యురోపియన్లు చారిత్రకంగా ఈ హిందూ పదాన్ని వాడేవారని ఆయన పేర్కొన్నారు. విభజించబడిన సమాజంలో ఏక హిందూమత భావన అన్నది అంతర్గతంగా లోపభూయిష్టంగా వుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త పెట్టుబడిదారీవాదం, హిందూత్వల సంకీర్ణమని ఆయన అభివర్ణించారు. ఫాసిజానికి సంబంధించిన అన్ని శక్తులు ఈ కూటమిలో వున్నాయన్నారు. భారతదేశాన్ని స్వేచ్ఛా భూమిగా మార్చేందుకు నిరంతర పోరాటం కొనసాగించాలని, అవిశ్రాంతంగా ప్రతిఘటన చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. భాష, సాహిత్యం, కళా రూపాలను సాధనాలుగా ఉపయోగించుకోవాల్సి వుందన్నారు. వర్గ, నైతిక అసమాతనలను ఎదుర్కొనాలని ఆయన సాంస్కృతిక కార్యకర్తలకు పిలుపిచ్చారు. సమాజంలో పురుషాధిక్యత పెరిగిపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొత్తగా తలెత్తుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు సామాజిక వాణిని పరిపుష్టం చేయాల్సి వుందని, అత్యంత అప్రమతంగా వుండాల్సి వుందని ఆయన పునరుద్ఘాటించారు. కేరళవ్యాప్తంగా 3 వేలకు పైగా సాహిత్య సంగమ్ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు, 650 మంది రచయితలు ఈ మహాసభలో పాల్గొన్నారు.

బెంగాల్ సచివాలయ ముట్టడి ఉద్రిక్తం

- విద్యార్థుల నిరసనలపై పోలీసుల జులుం

కొల్‌కతా : మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'చలో సచివాలయం' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కొల్‌కతాలో 'పశ్చిమబంగ ఛాత్ర సమాజ్' అనే విద్యార్థి సంఘం మంగళవారం చేపట్టిన ఈ ఆందోళనలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. సచివాలయం వైపు ప్రదర్శనగా వెళుతున్న విద్యార్థులను హౌరా బ్రిడ్జి వద్ద అడ్డుకునేందుకు నీటి ఫిరంగులు, భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. అంతకుముందు విద్యార్థులు పెద్ద సంఖ్యలో కాలేజ్ స్క్వేర్ వద్దకు చేరుకున్నారు. అయితే నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. సచివాలయానికి వెళ్లే దారులన్నింటినీ దిగ్బంధించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, వేలాది మంది పోలీసులను మోహరించారు. రోడ్లపై వాహనాలను, కంటైనర్లను అడ్డు పెట్టారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత, రక్షణ కల్పించడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విద్యార్థులు ఆరోపించారు. ఆందోళనకారులు ఉత్తర కోల్‌కతాలోని కాలేజ్ స్క్వేర్, హౌరాలోని సంత్రాగచి నుంచి రెండు బృందాలుగా ప్రదర్శనకు బయలుదేరారు. భద్రతాదళాలు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించుకొని ముందుకు వెళ్లేందుకు ప్రదర్శనకారులు ప్రయత్నించగా పోలీసులు వాటర్ క్యానన్లు ప్రయోగించారు. కాగా ర్యాలీ నిర్వహించకుండా విద్యార్థులను అడ్డుకోవద్దని రాజ్‌భవన్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించింది. నిరసన ప్రదర్శనను అడ్డుకోవడానికి బలప్రయోగం జరపాల్సిన అవసరమేమిటో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి అన్నారు. విద్యార్థులపై పోలీసుల అణిచివేత చర్యలను వ్యతిరేకిస్తూ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 12 గంటల పాటు సమ్మె చేపట్టాలని బిజెపి పిలుపునిచ్చింది. ఈ మేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి సుభాంత మజుందార్ పిలుపునిచ్చారు. అయితే బిజెపి సమ్మెకు పిలుపునివ్వడంపై అధికార తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సమ్మెకు పిలుపునివ్వడం రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనే బిజెపి కుట్ర పూరిత వ్యూహానికి నిదర్శనమని అధికార తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. మరోవైపు వైద్య విద్యార్థిపై హత్యాచారం కేసులో కొల్‌కతా నగర అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనూప్ దత్తాకు కూడా పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో సాక్ష్యాధారాలు వెలుగులోకి రాకుండా ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి అనూప్ సహకరించినట్లు సిబిఐ ఆరోపిస్తోంది.

కుల్గామ్‌లో తరిగామి నామినేషన్

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా ఫోరం అభ్యర్థిగా సిపిఎం నేత, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ తరిగామి కుల్గామ్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. కుల్గామ్ నియోజకవర్గం నుండి ఇండియా ఫోరం తరపున ఆయన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో ఇండియా ఫోరంలోని కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌తో సీట్ల సర్దుబాటు చేసుకున్న నేపథ్యంలో కుల్గామ్ నుంచి తరిగామి బరిలో నిలువాలని ఫోరంలోని పక్షాలన్నీ ఏకగ్రీవంగా నిర్ణయించాయి. దీంతో ఇక్కడ నుండి సిపిఎం అభ్యర్థిగా తరిగామి పోటీ చేస్తున్నారు. 1996 నుండి వరుసగా నాలుగుసార్లు తరిగామి ఈ నియోజకవర్గం నుండి గెలిచారు. ఈ దఫా ఎన్నికల్లో దేవ్‌సర్ నియోజకవర్గం కూడా పోటీ చేయాలని సిపిఎం తొలుత భావించినా..ఫోరంలో కీలక భాగస్వామ్యపక్షమైన నేషనల్ కాన్ఫరెన్స్ విజ్ఞప్తి మేరకు పోటీ నుంచి విరమించుకుంది. ఈ మేరకు తరిగామితో నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత డాక్టర్ ఫరూక్ అబ్దుల్లా చర్చలు జరిపారు. ఫోరం భాగస్వామ్య పక్షాల మధ్య ఐక్యతను కొనసాగించడం చాలా కీలకమని ఈ సందర్భంగా తరిగామి పేర్కొన్నారు. సమగ్ర దృక్పథంతో ఎన్నికలకు వెళ్ళేందుకు ఇండియా ఫోరం చేస్తున్న సమిష్టి కృషిని ఈ నిర్ణయం ప్రస్ఫుటం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా స్థానిక సమస్యల పరిష్కారంపైనే తరిగామి దృష్టి కేంద్రీకరిస్తున్నారు. కుల్గామ్ నియోజకవర్గ అభివృద్ధి పట్ల తనకు గల నిబద్ధతను కొనసాగిస్తున్నారు.

చిన్నారులను చిదిమేస్తున్న ఇజ్రాయిల్

- రోజుకు సగటున 53 మంది పసి పిల్లలు బలి

గాజా : పాలస్తీనా ప్రజలపై యుద్ధోన్మాదంతో రగిలిపోతున్న ఇజ్రాయిల్ చిన్నారులను చిదిమేస్తోంది. గాజాలో నెతన్యాహూ సైన్యం అత్యంత దారుణంగా, పాశవికంగా సాగిస్తున్న దాడుల్లో ఇప్పటివరకు 40,500 మంది పైగా చనిపోగా వారిలో 26 శాతం మంది పసి పిల్లలే ఉన్నారు. దాదాపు 17 వేల మంది పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోగా వేలాది మంది పిల్లలు క్షతగాత్రులయ్యారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధనేరాలు మొదలై 320 రోజులు అయింది. గతేడాది అక్టోబరు 7 నుండి ప్రతి రోజూ 53 మంది చొప్పున పిల్లలు మృత్యువాత పడుతున్నారు. 72 మంది స్త్రీ, పురుషులు చనిపోతున్నారు. మరణించిన మహిళల శాతం 18.4 శాతంగా వుంది. 40 వేల మందీ మానవ హారాన్ని ఏర్పాటు చేస్తే మన్‌హటన్ దీవి మొత్తాన్ని వారు చుట్టేయవచ్చు. అంటే 60 కిలోమీటర్ల చుట్టుకొలత వుంటుంది. సగటున ఒక వ్యక్తి గంటకు ఐదు కిలోమీటర్లు నడుస్తాడని అనుకుంటే మొత్తం మానవ హారం పూర్తి చేయడానికి 12 గంటలు పడుతుంది. అలాగే న్యూయార్క్ నగరంలోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వుంది. ఇందులో 19,500 మంది పడతారు. అంటే మాడిసన్ స్క్వేర్‌ను రెండుసార్లు భర్తీ చేయవచ్చు. 40 వేల మందినీ వరుసగా నిలుచోబెడితే ఆ లైన్ దాదాపు 24 కిలోమీటర్ల పొడవునా వుంటుంది. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి అన్ని విధాలా నిస్సిగ్గుగా సహకారమందిస్తున్న అమెరికా మృత్యుముఖానికి పసి పిల్లల మరణాలే ఉదాహరణ అంటూ అమెరికా నగరాల వరకు చిన్నారుల శవ పేటికలు పేర్చవచ్చు అని చెబుతూ ఒక జర్నలిస్టు పై విశ్లేషణ చేశారు. ఇక దాడుల సందర్భంగా శిథిలా కింద చిక్కుకుపోయి, మరణించి వుంటారని భావించిన వారు కనీసం 10వేల మంది వుంటారు. దాడులకు ముందు గాజా జనాభా 20 లక్షలు కాగా అందులో దాదాపు సగం మంది పిల్లలే. చనిపోయిన పిల్లలతో 550 క్లాస్ రూమ్‌లు నిండుతాయి. నిర్వాసితులైన పాలస్తీనియన్లు తల దాచుకోవడానికి స్కూళ్ళను ఉపయోగిస్తున్నారు. ఇటువంటివి 500కి పైగా స్కూళ్ళు వుండగా, వాటిని ఇజ్రాయిల్ లక్ష్యంగా పెట్టుకోవడంతో చాలావరకు ధ్వంసమయ్యాయి. 10 నెలల నుండి దాడులు కొనసాగుతుండడంతో గాజాలోని పిల్లలకు ఒక విద్యా సంవత్సరం పోయినట్లే.

తాజా దాడుల్లో 26 మంది మృతి

గాజాలో ప్రధానంగా డేర్ అల్ బాలాహ్, ఖాన్ యూనిస్ నగరాల్లో మంగళవారం ఉదయం 20మంది మరణించారు. మరోవైపు వెస్ట్ బ్యాంక్ శిబిరంపై ఇజ్రాయిల్ ఆర్మీ జరిపిన దాడిలో మరో 6గురు చనిపోయారు. ఇప్పటివరకు 40,476మంది చనిపోగా, 93,647మంది గాయపడ్డారు. వైద్య రంగానికి అవసరమైన ఇంధనాన్ని అందించడానికి ఇజ్రాయిల్ తిరస్కరిస్తోందని, ఆస్పత్రుల విధ్వంసమే వారి లక్ష్యంగా వుందని కమల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ విమర్శించారు. డేర్ అల్ బాలాహ్‌లో పెద్ద ఎత్తున ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ ఆదేశాలు జారీ చేయడంతో తమ సహాయక కార్యకలాపాలకు తాత్కాలికంగా విరామం ఇచ్చినట్లు ఐక్యరాజ్య సమితి పేర్కొంది.



ప్రధాని మోడీతో సమావేశమైన విజయన్

వయనాడ్ పునరుజ్జీవనానికి సహకరించండి

- ప్రధాని మోడీకి కేరళ సిఎం పినరయి విజయన్ వినతి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

కొండచరియలు విరిగిపడి చిన్నాభిన్నం అయిన వయనాడ్ పునరుజ్జీవనానికి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కోరారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వయనాడ్ విపత్తుపైనే ప్రధానంగా ఆయన మోడీతో చర్చించారు. ఈ విపత్తులో సర్వం కోల్పోయిన బాధితుల పునరావాసం కోసం కేంద్రం ఉదారంగా స్పందించి సముచితమైనరీతిలో ఆర్థిక సహాయం అందించాలని కేంద్రాన్ని విజయన్ కోరినట్లు కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) తెలిపింది. ఈ విపత్తుపై వివరణాత్మక సమగ్ర నివేదికను కూడా ప్రధానికి ముఖ్యమంత్రి అందజేసినట్లు పేర్కొంది. మరోవైపు వయనాడ్ పునరావాసంతో సహా బాధితులను ఆదుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు పినరయి విజయన్ గురువారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ప్రధానంగా బాధిత కుటుంబాలకు శాశ్వత వసతి ఏర్పాటు చేయడం పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో అన్ని వసతులతో కూడిన టౌన్‌షిప్‌ను సిద్ధం చేస్తామని ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్‌లో నిర్వహించే అఖిలపక్ష సమావేశంలో రాజకీయ పార్టీల నేతలతో పాటు రెవెన్యూ, అటవీ, జలవనరులు, విద్యుత్తు, రవాణా, రిజిస్ట్రేషన్, ఆర్థిక, పబ్లిక్ వర్క్స్, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన సంక్షేమ శాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులు పాల్గొంటారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. వయనాడ్‌లో భారీ కొండచరియలు విరిగిపడడంతో 308 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. మెప్పాడి ప్రాంతంలోని చూరల్‌మల, ముండక్కై ప్రాంతాలు పూర్తిస్థాయిలో విధ్వంసానికి గురయ్యాయి.

శాంతియుత మార్గమే మేలు

- ఉక్రెయిన్ పర్యటన నేపథ్యంలో పుతిన్‌తో మోడీ

న్యూఢిల్లీ : ఘర్షణలకు తావులేని శాంతియుత పరిష్కార మార్గాలకే భారత్ కట్టుబడివుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. అమెరికా ప్రోద్బలంతో రష్యాపై ఉక్రెయిన్ కాలుదువ్వడం, అనంతరం ఉక్రెయిన్‌లో రష్యా సైనిక ఆపరేషన్ చేపట్టడంతో అక్కడ ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌లో పర్యటించివచ్చిన మోడీ మంగళవారం రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ పర్యటన విశేషాలను ఆయనతో పంచుకున్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణపై పరస్పర వైఖరులను పుతిన్‌తో పంచుకున్నట్లు తెలిపారు. సమస్యకు త్వరితగతిన, అన్ని పక్షాలు కట్టుబడి వుండేలా, శాంతియుత పరిష్కారానికి భారత్ కట్టుబడి వుందని మోడీ ఆ పోస్టులో పేర్కొన్నారు. రష్యా, భారత్ మధ్య గల ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యలపై కూడా ఇరువురు నేతలు చర్చించారు.

బ్రిక్స్ సదస్సుకు మోడీ

అక్టోబరు 22 నుండి 24 వరకు కజన్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరవుతానని మోడీ ఈ సందర్భంగా పుతిన్‌కు స్పష్టం చేశారు. బ్రిక్స్‌ను విస్తరించిన తర్వాత జరుగుతున్న మొదటి సదస్సు ఇదే. వివిధ స్థాయిల్లో ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగించడానికి పుతిన్, మోడీలు అంగీకరించారు. జులైలో రష్యాలో భారత ప్రధాని పర్యటించినపుడు వాణిజ్య ఆర్థిక రంగాల్లో కుదిరిన ఒప్పందాలను అమలు చేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ప్రస్తుతం బ్రిక్స్‌కు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రష్యా కజన్‌లో సదస్సుకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ ఏడాది జనవరి 1న ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు బ్రిక్స్‌లో చేరాయి. దీంతో బ్రిక్స్ 10 మంది సభ్యులు గల బ్లాక్‌గా మారింది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలు వ్యవస్థాపక సభ్యులుగా వున్నాయి.

గుజరాత్‌లో భారీ వర్షాలకు 8 మంది మృతి

అహ్మదాబాద్ : గుజరాత్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మంగళవారం కూడా రాష్ట్రాన్ని ముంచెత్తాయి. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని 96 రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. మరో 19 రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి దగ్గరగా చేరుకున్నాయి. భారీ వర్షాలకు సంబంధించిన కారణాలతో సోమవారం 8 మంది మరణించినట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. లోతట్టు ప్రాంతాల నుంచి 23,871 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపింది. అలాగే వరద నీటిలో చిక్కుకున్న దాదాపు 1,700 మంది సురక్షితంగా రక్షించినట్లు ప్రకటించింది. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ప్రకటించిన సమాచారం ప్రకారం రాష్ట్రం సగటు వార్షిక వర్షపాతంలో దాదాపు 100 ఇప్పటికే కురిసింది. నర్మదా నదికి ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహం కారణంగా సర్దార్ సరోవర్ డ్యామ్‌లోని మొత్తం 30 గేట్లకు 23 గేట్లను తెరిచారు. దీని ఫలితంగా భరూచ్ వద్ద నర్మదా ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తోంది. విశ్వామిత్రా నది కూడా ప్రమాదకర స్థాయి మించి ప్రవహిస్తోంది. దీంతో వడోదరలో అనేక లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. 3 వేలకు మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల వర్షాల కారణంగా పశ్చిమ రైల్వే 30 రైళ్లను మంగళవారం రద్దు చేసింది. 13 రైళ్లను కొద్ది దూరానికే పరిమిత చేసింది. మరో 36 రైళ్లను దారి మళ్లించింది.

పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

గుజరాత్‌లోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. సౌరాష్ట్ర ప్రాంతం, కచ్, ఖేడా, ఆనంద్, పంచమహల్, దాహోద్, తాపీ, నవ్సారి, వల్సాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు రోజుల పాటు ఈ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అన్ని జిల్లాల్లోనూ విపత్తు పరిస్థితులను ఎదుర్కొవడానికి ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ దళాలను మోహరించారు.

మోడీ ప్రారంభించిన 8 నెలలకే కూలిన శివాజీ విగ్రహం

ముంబయి : మహారాష్ట్రలోని సింధుదుర్గ్‌లో ఇటీవల ప్రధాని అట్టహాసంగా ప్రారంభించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం సోమవారం కుప్పకూలింది. గతేడాది డిసెంబర్ 4న ప్రధాని ఈ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ ఘటనపై బిఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కాంట్రాక్టర్ జయదీప్ ఆప్టే మరియు నిర్మాణ సలహాదారు చేతన్ పాటిల్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కుట్ర, మోసం, ప్రజాభద్రతకు హానీ కలిగించడం వంటి సెక్షన్లను నమోదు చేశారు. విగ్రహ నిర్మాణంలో వినియోగించిన స్టీల్ నాణ్యత తక్కువగా ఉందని, నట్‌లు, బోల్టులు తుప్పు పట్టినట్లు తేలినట్లు పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యుడి) పేర్కొంది. ప్రారంభించిన ఎనిమిది నెలల్లోపే విగ్రహం క్షీణస్థితికి చేరుకోవడంపై స్థానికులు, పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 20న పిడబ్ల్యుడి మల్వాన్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ హెచ్చరికలు కూడా చేశారు. నట్లు, బోల్టులు తుప్పు పట్టడంతో విగ్రహం దెబ్బతినే పరిస్థితి ఉందని అన్నారు. అయినప్పటికీ కాంట్రాక్టర్లు పట్టించుకోలేదని అన్నారు. విగ్రహ నిర్మాణానికి వినియోగించిన స్టీల్ తుప్పు పట్టడం ప్రారంభించిందని, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా నేవీ అధికారులకు లిఖితపూర్వక నివేదిక సమర్పించినట్లు సింధుదుర్గ్ మంత్రి రవీంద్ర చవాన్ పేర్కొన్నారు.

విగ్రహ నిర్మాణంలో ఎటువంటి నైపుణ్యంలేని నేవీ విగ్రహాన్ని మరియు దాని పీఠాన్ని ప్రతిష్ఠించే పనిని సెప్టెంబర్ 8న ప్రారంభించింది. డిసెంబర్ 4న నేవీ డే రోజున రాజ్‌కోట్‌లో విగ్రహాన్ని ఆవిష్కరించారు. బలమైన గాలుల కారణంగా విగ్రహం కూలిపోయిందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే పేర్కొన్నారు. విగ్రహం కూలిపోయిన సమయంలో గంటకు 45 కి.మీ వేగంతో గాలులు వీచాయని అన్నారు. అయితే ఆప్రాంతంలో వాతావరణ పరిస్థితులను అంచనావేయకుండా విగ్రహాన్ని ఎలా ప్రతిష్ఠించారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి.

'అమ్మ'కు మోహన్‌లాల్ రాజీనామా .. పాలక మండలి రద్దు

కొచ్చి : మలయాళ చిత్రసీమలో నటీమణ